ఆమె..అంతంతే
- సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ
- ఉమ్మడి వరంగల్ జిల్లా బరిలో 27 మందే..
- పురుషులు 188 మంది..
- మొత్తం 215 మంది పోటీకి సై

- 10లో▸



పథకాలు దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/22^0$

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రతలు ఉంటాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు పర్యవేక్షించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సంపత్ రాజు, గట్టయ్య, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



జనగామ : మహిళలు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గైనకాలజిస్ట్ ప్రీతి దయాళ్ అన్నారు. 'మహిళా ఆరోగ్యం' అనే అంశంపై శనివారం జనగామ మండలం పెంబర్తిలోని జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్‌వీఎన్.చారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యుక్త వయసులో రుతుక్రమ సమస్యలు, రక్త హీనత, సమతుల ఆహారం, పరిశుభ్రత, పీసీఓడీ విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఏటీసీ అనూష, ఉపన్యాసకులు అనిత, నిరోష, సంధ్యారాణి, కళ్యాణి, సౌమ్య, ఆశాజ్యోతి, ప్రేమలత, సుప్రజ, అఖిల, కవిత, బేబీ, రాణి, మాధవి, భూలక్ష్మి, శోభ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఉద్యమకారుల రాజీనామా

జనగామ: తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న గుజ్జుక రాజు, ఆలూరి రమేష్ గులాబీ పార్టీకి రాజీనామా చేస్తూ.. పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి శనివారం లేఖలు పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పుట్టుక నుంచి కష్టపడి పని చేయడంతో పాటు పోలీసుల లాఠీ దెబ్బలుతిని, జైలు జీవితం గడిపామన్నారు. ఇన్ని త్యాగాలు చేసినా పార్టీలో గౌరవం లభించలేదని రాజు వాపోయారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటే వేయని చాలా మంది ఇప్పుడు అంతా మేమే అంటూ పెత్తనం చేస్తున్నారని, పార్టీలో ఉంటూ అవమానాలను తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. నేడు(ఆదివారం) బీజేపీలో చేరుతున్నట్లు రాజు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



జనగామ రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ పాదర్ విజయపాల్‌రెడ్డి అన్నారు. యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిరంతరం కష్టపడుతూ సమాజం గర్వించే ఇంజనీర్లుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



జనగామ రూరల్ : జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం వడ్లకొండ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. బీఏ వ్యవసాయ అర్థశాస్త్ర పాఠ్యాంశ బోధనలో భాగంగా ధాన్యం ఉత్పత్తి, మార్కెటింగ్ వివిధ దశలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు క్షేత్ర సందర్శన చేపట్టినట్లు కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కలువల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెటింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నరసయ్య, అధ్యాపకులు డాక్టర్ టి.వెంకటరెడ్డి, మోహన్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

కమలంలో ఖుషి..



ఖిలా వరంగల్ మైదానంలో జరిగిన సభకు హాజరైన జనం,(ఇన్‌సెట్‌లో) నమస్కరిస్తున్న అమిత్ షా

- ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- బీఆర్‌ఎస్ టార్గెట్‌గా సాగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగం
- కేసీఆర్ అవినీతి పెరిగిపోయిందని, కక్కిస్తామని వ్యాఖ్యలు..
- కేంద్రం కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలపై వివరణ
- వరంగల్ ఎంజీఎంకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ
- డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే మరింత అభివృద్ధి
- వరంగల్ పుణ్య భూమిపై అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడి



ఎర్రబెల్లి ప్రదీప్‌రావును గెలిపించాలని కోరుతున్న అమిత్‌షా

ఖిలా వరంగల్ : ఎన్నికల ప్రచారం మొదలయ్యాక తొలిసారి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వరంగల్‌కు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఖిలా వరంగల్ మైదానంలో శనివారం జరిగిన బీజేపీ ఓరుగల్లు సకల జనుల విజయ సంకల్ప సభకు జనం నుంచి భారీగా స్పందన రావడంతో ఆ పార్టీ నాయకులు ఖుషీలో ఉన్నారు. అమిత్‌షా ప్రసంగం మొత్తం బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తూ.. కేంద్ర సంక్షేమంపై సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. సభ ప్రారంభానికి ముందే భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అమిత్ షా నేరుగా కాన్వాయ్‌లో సభా మైదానానికి చేరుకున్నారు. వేదికపైకి చేరుకుని హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులను పరిచయం చేసి ప్రసంగం మొదలుపెట్టారు. డబుల్ ఇంజన్ సర్కారు వస్తే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి జరుగుతుందని, అవకాశం ఇస్తే బీసీని సీఎం చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీని గెలిపిస్తే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని చెప్పగా, సభకు వచ్చిన జనం చప్పట్లు, కేరింతలతో ప్రాంగణమంతా మార్మోగింది. ఓరుగల్లుకు గొప్ప చరిత్ర ఉందని, కాకతీయుల కళారాజ్యంలో భద్రకాళి, రామప్ప లాంటి ఎన్నో పవిత్రమైన పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, అటువంటి పుణ్య భూమిపై అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ ప్రజల ప్రగతి కోసం ఎంతో చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావు పద్మ, డాక్టర్ కాళీప్రసాద్‌రావు, కొండేటి శ్రీధర్, కంభంపాటి పుల్లారావు, కీర్తిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ పాలనపై విమర్శల వెల్లువ

పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నాశనం చేశారని అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. సర్వ సంపన్న తెలంగాణను సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి, కుంభకోణాలతో అప్పులకుప్పగా మార్చారని దుమ్మెత్తి పోశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయలో అవినీతి, అతిపెద్ద కుంభకోణం జరిగిందని, ఇలా లెక్కబెట్టాలంటే వారం రోజులు పడుతుందని ఆరోపించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఎలుకలు కొరికి రోగి చనిపోయినా పట్టింపులేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రూ.వేల కోట్లు కేటాయించి అభివృద్ధిలో వరంగల్‌ను ముందుంచుతామని హామీ ఇచ్చారు. ఎడ్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్, కుసుమ సతీష్, గంట రవికుమార్, అల్లం నాగరాజు, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..
సాయంత్రం 4.20 గంటలకు హెలికాప్టర్‌లో మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు రాక
4.32 గంటలకు: ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ సభ వద్దకు ..
4.36 గంటలకు : ప్రసంగం ప్రారంభం.
4.54 గంటలకు: ప్రసంగం ముగింపు
4.55 గంటలకు: ఎయిర్‌పోర్ట్‌కు వాహనంలో బయల్దేరిన అమిత్ షా
5.10 గంటలకు : ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్‌కు పయనం

తూర్పును గూండాల నుంచి కాపాడాలి : బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు



వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని గూండాల రాజ్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తూర్పు అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఆజంజాహి మిల్లును అమ్మి, సెంట్రల్ జైలును కుదువపెట్టినందున వరంగల్ ప్రజలు, యువతకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని డ్రెయినేజీలు, నాలాలు ఆక్రమణకు గురికావడంతో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ అభివృద్ధి చేయడమే కాకుండా కేంద్రం నుంచి భారీ పరిశ్రమలను తీసుకువస్తామని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తి



జనగామ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఆర్‌ఓలు, రాజయ పార్టీల ప్రతినిధులు

జనగామ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధి జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల ఆర్‌ఓ కార్యాలయాల్లో శనివానం ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. జనరల్ అబ్జర్వర్ కె.రాజమణి, జిల్లా సహాయ ఎన్నికల అధికారి సుహాసిని, ఆర్‌ఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను కేటాయించారు.

రెండో దశ శిక్షణకు సిద్ధంగా ఉండాలి

పీఓ, ఏపీఓలకు రెండవ దశ శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య అన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లు, పోల్ డే రోజు రిస్క్ మేనేజ్‌మెంట్, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది శిక్షణకు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నోడల్ ఆఫీసర్లు అనిల్‌కుమార్, వినోద్‌కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, రాము, రంగాచారి, మాస్టర్ ట్రైనర్లు రామరాజు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు వేయాలి

లింగాలఘణపురం: ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల జిల్లా నోడల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులతో మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని కోరారు. కొత్తగా ఓటు హక్కు పొందడానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అఖండ జ్యోతి'కి తరలిరావాలి

పాలకుర్తి టౌన్: అఖండ జ్యోతి నిర్వహిస్తున్న పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం దక్షిణ భారతదేశంలోనే మూడవది.. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 26న నిర్వహించే అఖండ జ్యోతి దర్శనానికి భక్తులు తరలిరావాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆహ్వాన పత్రికను ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న కలెక్టర్‌కు అందజేశారు. ఆలయ అర్చకుడు దేవగిరి లక్ష్మన్న, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలి

- రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు ఉపేందర్



జాహ్నవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నర్మెట: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు ఉపేందర్ సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తల్లితండ్రులు పిల్లలకు ఇంటివద్ద స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించడంతోపాటు వారి నడవడిని గమనిస్తూ సూచనలు అందించాలన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న టెన్త్ విద్యార్థిని బైరోజు జాహ్నవితో పాటు ఆమెను ప్రోత్సహిస్తున్న తండ్రిని సన్మానించారు. సెక్టోరియల్ అధికారులు నర్సింహారావు, రమేష్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సదానందం పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలి

జఫర్‌గఢ్: విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఉమ్మడి వరంగల్ ఎఫ్‌ఎల్‌ఎన్ పరిశీలకులు రాఘవులు, శ్యాంసుందర్, మండల నోడల్ ఆఫీసర్ పర్వేజ్ అన్నారు. కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రగతిని వారు శనివారం పరిశీలించారు. అనంతరం పేరెంట్స్ సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం పాఠశాలకు హాజరయ్యేలా తల్లి దండ్రులు ప్రోత్సహించాలన్నారు. హెచ్‌ఎం సురేందర్, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, సోమయ్య, శ్రీని వాస్, మధన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

'సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి'

జనగామ: పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడంతోనే దేశ నిర్మాణం జరుగుతుందని గ్లోబల్ ఫౌండేషన్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పుస్కూరి సోమేశ్వర్‌రావు అన్నారు. శనివారం జనగామ, పెంబర్తి బాల సంస్కార్ కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ధనమే అన్నింటికీ మూలం అనే విధంగా ప్రస్తుత విద్యా వ్యవస్థ సాగుతోందని, వ్యక్తిగత శీలం, సంస్కారం లేనప్పుడు ధనానికి విలువ ఉండదన్నారు. విలువలతో కూడిన సంస్కారవంతమైన విద్య నేర్పించాలని సూచించారు.

రాజధానికి చేరిన పాలకుర్తి ప్రచారం

- స్థానిక ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు సన్నద్ధం
- నేడు హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనాలు
- సోషల్ మీడియాల్లో లొకేషన్లు వైరల్

దేవరుప్పుల: ఈసారి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలకు రాజధానిలో ఉన్న స్థానికుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. దీంతో పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రంగంలోకి దిగాయి. ఈ మేరకు ఆదివారం ఇరు పార్టీలు ఎన్నికల కోడ్ వర్తించకుండా వివిధ కార్యక్రమాలతోపాటు ఆత్మీయ సమ్మేళనాల పేరిట సమావేశాలకు సన్నద్ధం అయ్యాయి. పాలకుర్తి నియోజకవర్గంలో 2,51,490 మంది ఓటర్లు ఉండగా.. తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర, కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు చెందిన సుమారు 60 వేల మంది పైచిలుకు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార తదితర రంగాల్లో జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. వీరందరినీ ఏకం చేసి ప్రత్యర్థుల కంటే మొదలు కమిట్‌మెంట్ చేసుకునేలా ఇరు పార్టీల నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆయా మండలాల పరిధి గ్రామాల వారీగా ముందస్తు ఓటర్ల జాబితా తయారు చేసి ప్రత్యేక టీంలుగా ఏర్పడి.. నేటి ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చేలా పావులు కదుపుతున్నారు. ఏది ఎమైనా నిత్యం స్థానికంగా ఉండే తమకంటే బయట జీవించే స్థానిక ఓటర్లకు అత్యంత ప్రాధాన్యతతో కూడిన మర్యాదలు రావడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఆదివారం హైదరాబాద్‌లోని నాగోల్, బోడుప్పల్, నాగారం తదితర ప్రాంతాల్లో నిర్వహించే సమావేశాల లొకేషన్లను సోషల్ మీడియాల్లో బాహాటంగా వైరల్ చేయడం కొసమెరుపు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.. బాలికలు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జనగామ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. పట్టణంలోని బాలా సదన్-చిల్డ్రన్స్ హోంను ఆయన శనివారం సందర్శించారు. పిల్లలకు వడ్డించే ఆహారం, వసతి సౌకర్యాలను ప్రత్యక్షంగా చూశారు. అనంతనం విక్రమ్ మాట్లాడుతూ సదన్‌లో రోజువారీగా బాలికలకు మంచి అలవాట్లతో పాటు జీవిత పాఠాలను నేర్పించాలన్నారు. ముఖ్యంగా బయట వ్యక్తులు ఇచ్చే ఎటువంటి ఆహారం తీసుకోవద్దని, దాని వలన వచ్చే అనర్థాలను వివరించాలని చెప్పారు. చదువుతో పాటు ఏపని చేసినా తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. చెడు అలవాట్ల జోలిక వెళ్లరాదని, చిన్న చిన్న దొంగతనాలు భవిష్యత్‌లో పెద్ద నేరాలకు దారి తీస్తాయని చెప్పారు. కుటుంబ సభ్యులు, చదువు చెప్పే ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో ఉన్నప్పుడే జీవితంలో ఉన్నతంగా జీవించగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో బాలసదన్ ఇన్‌చార్జ్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో ఘనంగా ప్రీ క్రిస్మస్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని ఆడిటోరియంలో శనివారం విద్యార్థులు నిట్‌మాస్–23 పేరిట ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిట్‌లో సెమిస్టర్ ఎగ్జామ్స్, తర్వాత సెలవులు ఉండడంతో క్రిస్మస్ పండుగకు కళాశాలలో అందుబాటులో ఉండని సందర్భంగా ఈవేడుకలు జరుపుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. రాబోయే క్రిస్మస్ సందర్భంగా ఏసు క్రీస్తు జననం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ జింగిల్ బెల్.. జింగిల్ బెల్ అంటూ పాటలతో అలరించారు. నిట్‌మాస్–23 వేడుకల్లో భాగంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నిట్ డీన్‌లు శ్రీనివాసాచార్య, ఎడ్వర్డ్ విలియమ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే రైతుల బతుకులు ఆగమే



వెంకటాపురంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నాంచారిమడూరులో ప్రచారానికి ర్యాలీగా వస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

- కొట్లాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను గెలిపించాలి
- బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దయాకర్‌రావును ఎత్తుకున్న కార్యకర్తలు



చింతకింది శ్రీహరికి కండువా కప్పుతున్న ఎర్రబెల్లి

తొర్రూరు రూరల్/రాయపర్తి/దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులతోపాటు అన్నివర్గాల ప్రజల బతుకులు ఆగమవుతాయని బీఆర్‌ఎస్ పార్టీ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆయన శనివారం తొర్రూరు మండలంలోని గుడిబండతండా, నాంచారిమడూరు, పెద్దమంగ్యాతండా, టీక్యాతండా, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, అరిపిరాల, కర్కాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు బోనాలు, బతుకమ్మలు, డప్పుచప్పుళ్లు, కోలాటాలు, నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ తన పాలనలో తెలంగాణ ప్రాంతాన్ని సర్వనాశనం చేసిన కాంగ్రెస్ పార్టీ మరొక్కసారి అవకాశం ఇవ్వాలని అడగడం సిగ్గుచేటు అని అన్నారు. ఇలాంటి పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

కేసీఆర్ ఉంటేనే తెలంగాణకు రక్ష..

ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎంగా ఉంటేనే తెలంగాణ రాష్ట్రానికి రక్షగా ఉంటుందని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ఎంతో అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ సర్కారు.. మరోసారి అధికారంలోకి వస్తే ప్రజలకు ఎలాంటి జబ్బు వచ్చినా, ప్రమాదాలు జరిగినా రూ.15 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, నలమాస ప్రమోద్‌గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

రాయపర్తి: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో మంత్రి కుమారుడు ఎర్రబెల్లి ప్రేమ్‌చందర్‌రావుతో కలిసి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలను కంటికి రెప్పలాకాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రాయపర్తి మండలం ఊకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బండపల్లి భిక్షపతి, జేతురాంతండా ఉపసర్పంచ్ జాటోతు అనిల్.. బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తమదేనని, దయాకర్‌రావును గెలిపించుకోవాలని ఈ సందర్భంగా గోపాల్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, సర్పంచ్ నేతావత్ కిషన్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, నాగపురి రాంబాబు, ఉందాటి సతీష్, మచ్చ లక్ష్మీనారాయణ, ఎండీ.నయీం, తౌడుశెట్టి రామారావు, రావుల వెంకట్‌రెడ్డి, రవినాయక్, మచ్చ శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి సమక్షంలో..

దేవరుప్పుల మండలం ముస్‌పహాడ్‌కు చెందిన వైఎస్సార్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ బంగారు తెలంగాణ కేసీఆర్ సారథ్యంలోనే సాధ్యమవుతుందని, అందుకే పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్‌రెడ్డి, శీల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



అంతులేని అభిమానం..

ఖిలావరంగల్ వాకర్స్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వరంగల్ పెరుకవాడకు చెందిన ఓ బీజేపీ నేత వినూత్నంగా హాజరయ్యాడు. బైక్‌కు పదుల సంఖ్యలో పార్టీ జెండాలు ఏర్పాటు చేసి అందరిని ఆకర్షించాడు. – ఖిలా వరంగల్



చకోడి చేస్తా..'చేయి' కలుపు..

కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భార్య అరుణ శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లి బజ్జీ, చకోడిలు చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – బచ్చన్నపేట



మల్లా.. 'చల్లా'నే గెలిపించాలి..

బీఆర్ఎస్ పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల షాపు వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ చల్లానే గెలిపించాలని అభ్యర్థించారు. – ఆత్మకూరు



దర్జీ..నాయక్

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ షాపులో దుస్తులు కుట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. – మహబూబాబాద్

జంగ్ తెలంగాణ

ఆమె.. అంతంతే



విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా వివిధ రంగాల్లో మహిళలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నారు. తమకు లభించిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ పురుషులకు దీటుగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే అవగాహన లేకనో.. అవకాశం రాకనో కాని రాజకీయ కదన రంగంలో మాత్రం అంతంత పాత్రే పోషిస్తున్నారు. దీనికి నిదర్శనమే ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 188 మంది పురుష అభ్యర్థులు పోటీపడుతుండగా 27 మంది మహిళలు మాత్రమే బరిలో నిలిచారు. దీంతో రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

సాధారణ ఎన్నికల్లో స్వల్పంగానే మహిళల పోటీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో బరిలో 27 మందే ..
- పురుషులు 188 మంది..
- మొత్తం 215 మంది పోటీకి సై


రావు పద్మ(బీజేపీ)


సురేఖ(కాంగ్రెస్)


సీతక్క(కాంగ్రెస్)


నాగజ్యోతి(బీఆర్ఎస్)


కీర్తిరెడ్డి(బీజేపీ)


యశస్విని(కాంగ్రెస్)


సంగీత(బీజేపీ)


ఇందిర(కాంగ్రెస్)

హన్మకొండ: రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మహిళలు బరిలోకి దిగారు. 12 నియోజక వర్గాల్లో ఒక్కటి మినహా 11 స్థానాల్లో బ్యాలెట్ పోరులో నిలిచారు. ప్రధాన పార్టీ అభ్యర్థులుగా, రిజిస్టర్ పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 29,74,564 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 15,05,252 మంది ఉండగా, పురుష ఓటర్లు 14,68,845 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 467 మంది ఉన్నారు. 36,407 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 215 మంది ఎన్నికల బరిలో నిలించారు. ఇందులో 188 మంది పురుషులుండగా 27 మంది మాత్రమే మహిళలు పోటీ చేస్తున్నారు. జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు ఎన్నికలో ఆ మేరకు ప్రాధాన్యం, ప్రాతినిధ్యం లభించడం లేదు. పోటీ చేసిన అభ్యర్థుల్లో 12.6 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్ఎస్ నుంచి ఒక్కరు పార్టీ అభ్యర్థిత్వం దక్కించుకున్నారు. మిగతా మహిళా అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీ, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. కాగా పరకాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు. 11 నియోజకవర్గాల్లో మాత్రమే మహిళా అభ్యర్థులు నామినేషన్లు వేసి చివరికంటూ పోటీలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ చిత్రపు పుష్పలత లయ పోటీ చేస్తున్నారు.

- **వరంగల్ పశ్చిమ** నియోజకవర్గంలో బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు మహిళలు ఉన్నారు. బీజేపీ నుంచి రావు పద్మ, ధర్మసమాజ్ పార్టీ నుంచి కోగిల రూప ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- **వరంగల్ తూర్పు** నియోజకవర్గం నుంచి ఎన్నికల రణరంగంలో 29 మంది పోటీ పడుతున్నారు. ఇక్కడ ఆరుగురు మహిళలు, ఒక ట్రాన్స్‌జెండర్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి కొండా సురేఖ, స్వతంత్రులుగా జన్ను ప్రమీల, పల్లకొండ మహేశ్వరి, పోలేపాక చంద్రకళ, భవంతుల రాధిక, జోగు శ్వేత ఉండగా ఇక్కడి నుంచి ట్రాన్స్ జెండర్ చిత్రపు పుష్పలత లయ (బీఎస్పీ) ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్నారు.
- **పరకాల** నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇక్కడ ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరు.
- **వర్ధన్నపేట** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో 14 మంది నిలిచారు. ఇక్కడ ఇద్దరు మహిళలు పోటీలో నిలిచారు. ఎంసీపీఐ నుంచి కొత్తపల్లి సావిత్రి, సరిగొమ్ముల స్నేహలత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **నర్సంపేట** నియోజకవర్గం నుంచి 16 మంది ఎన్నికల రణరంగంలో పోటీ పడుతున్నారు. ఇక్కడ 15 మంది పురుషులు పోటీ చేస్తుండగా, మహిళా అభ్యర్థి ఆరెల్లి లత (జన శంఖారావం) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **భూపాలపల్లి** నియోజకవర్గంలో మొత్తం 23 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ఐదుగురు మహిళలు బరిలో ఉన్నారు. చందుపట్ల కీర్తిరెడ్డి (బీజేపీ), రత్నం పోశమ్మ (సోషల్ జస్టిస్ పార్టీ), అల్లకొండ స్రవంతి (అబాద్ పార్టీ), మహమ్మద్ ఆశ్రఫ్ (ఎంసీపీఐ-యూ) గోపిదాస్ రజని(స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **ములుగు** నియోజకవర్గం నుంచి మొత్తం 11 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ ముగ్గురు మహిళలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బడే నాగజ్యోతి (బీఆర్ఎస్), ధనసరి అనసూర్య (సీతక్క) (కాంగ్రెస్), వజ్జ సమ్మక్క (స్వతంత్ర) పోటీలో ఉన్నారు.
- **మహబూబాబాద్** నియోజకవర్గం నుంచి మొత్తం 12 మంది ఎన్నికల బరిలో ఉండగా భట్టు భిన్నమ్మ (స్వతంత్ర) ఒక్కరే పోటీలో ఉన్నారు.
- **డోర్నకల్** నియోజకవర్గంలో ఎన్నికల బరిలో మొత్తం 14 మంది ఉన్నారు. ఇందులో ఇద్దరు మహిళలు పోటీ చేస్తున్నారు. భూక్యా సంగీత (బీజేపీ), గుగులోత్ పార్వతి (బీఎస్పీ) పోటీలో ఉన్నారు.
- **పాలకుర్తి** నియోజకవర్గం నుంచి మొత్తం 15 మంది ఎన్నికల బరిలో నిలిచారు. మామిడాల యశస్విని (కాంగ్రెస్) ఒక్కరే మహిళా అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.
- **జనగామ** నియోజక వర్గంలో మొత్తం 19 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో ఒక్కరు మాత్రమే మహిళా అభ్యర్థి ఉన్నారు. జంగా సుజాత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు.
- **స్టేషన్ ఘన్‌పూర్** నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ ముగ్గురు మహిళలు పోటీ చేస్తున్నారు. సింగాపురం ఇందిర (కాంగ్రెస్), చిలుక వర్ష, కుర్సపల్లి నవ్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

కోడ్ ఉల్లంఘన.. కేసు నమోదు

నర్సింహులపేట: బీజేపీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా సంగీత ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్వామి వివేకానందా విగ్రహ ప్రహరీ, కరెంట్ స్తంభాలకు అభ్యర్థి ప్రచార పోస్టర్ అంటించారు. ప్రచారాలకు ప్రభుత్వ ఆస్తులను వాడుకోవడంతో పలువురు యువకులు శనివారం గమనించి సీ-విజిల్ ఎల్ ఐడీ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎన్నికల అధికారి కేశవరావు, ఎఫ్ఎస్‌టీ టీం అధికారి రాజలింగం ఘటనా స్థలిని పరిశీలించారు. రుజువు కావడంతో బీజేపీ అభ్యర్థి సంగీతపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు.

యువకుడి మృతి

ములుగు రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పత్తిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పోరిక సురేష్ (25) తన తల్లి ఇంట్లో దుస్తులు ఉతికి తీగపై ఆరేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. తల్లిని రక్షించే క్రమంలో సురేష్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరు స్పృహ కోల్పోయారు. కొంత సమయం తర్వాత తల్లి తేరుకుంది. సురేష్ తేరుకోకపోవడంతో గమనించిన కుటుంబీకులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. సురేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


ప్రచారంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి


ప్రచార ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

ధర్మసాగర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. కాజీపేట మండలంలోని రాంపూర్, ధర్మసాగర్ మండలంలోని ఉనికిచర్లలో శనివారం సాయంత్రం జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రైతుల భూములు ఎలా ఉన్నాయి, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 10 సంవత్సరాల్లో రైతుల భూములు ఎలా ఉన్నాయో రైతులే చెప్పాలని తెలిపారు. ఈ నెల 20న జరిగే కేసీఆర్ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేటర్‌లు సరోజన, ఆవాల రాధికారెడ్డి, నాయకులు పెద్ది నరేందర్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, పిట్టల స్వామి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా .. ఆశీర్వదించండి

ఐనవోలు: ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని వెంకటాపూర్‌లో కడియం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని గ్యారంటీలు ప్రకటిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించి లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోస పోవద్దన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. పేద ప్రజలను ఆదుకునే బీఆర్ఎస్ పార్టీకి మూడోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసమే ల్యాండ్ పూలింగ్ గురించి మాట్లాడి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని.. ల్యాండ్ పూలింగ్ ఉండదని తెలిపారు. వెంకటాపూర్ నుంచి కొండపర్తి వరకు బీటీ రోడ్డు గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు తదితర పనులన్నీ చేస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీటీసీ ఇల్లందుల బేబి, సర్పంచ్ గోకే రేణుక, ఎంపీటీసీ పిండి మాధవి, నాయకులు తీగల కరుణాకర్, షఫ్రక్, పిండి రవీందర్, మాదాసి పద్మ, దోబీల మోహన్, రమేష్, యాదగిరి, అయోధ్య, పెద్దిరెడ్డి, జ్యోతి, భాస్కర్, రాంచంద్రం, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.


ఐనవోలు: మాట్లాడుతున్న కడియం శ్రీహరి


శివునిపల్లిలో ప్రచారం చేస్తున్న కడియం కుమార్తెలు

తండ్రి గెలుపునకు కుమార్తెల ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపు కోసం తన ముగ్గురు కుమార్తెలు డాక్టర్ కావ్య, దివ్య, రమ్య శనివారం శివునిపల్లిలో విస్తృత ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, మహిళలతో కలిసి గ్రామంలో బొడ్రాయి వద్ద నుంచి వివేకానంద చౌరస్తా వరకు, అక్కడ నుంచి ఎస్సీ కాలనీ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బూర్ల శంకర్, ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

పూరీలు, బొండాలు చేసిన కుమార్తెలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని శివునిపల్లిలో కడియం శ్రీహరి కుమార్తెలు ఓ హోటల్ వద్ద పూరీలు, బొండాలు చేస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని హోటల్ నిర్వాహకులను, హోటల్‌లోని వారిని కోరారు.

కడియం శ్రీహరితోనే అభివృద్ధి సాధ్యం

రాజకీయంలో అపార అనుభవమున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి ద్వారానే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎస్ఎమ్మార్పీఎస్(జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్.రమేష్‌కుమార్ మాదిగ అన్నారు. డివిజన్‌కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకి, కడియం శ్రీహరికే అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదెపాక నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికాయల చిరంజీవి, టి.సంపత్, చెరిపెల్లి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఘన్‌పూర్ క్లస్టర్-1 ఇన్‌చార్జ్ బెలిదె వెంకన్నగుప్తా ఆధ్వర్యంలో మండలంలోని చంద్రుతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై చంద్రుతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కడియం భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

ఇంటింటా ప్రచారం..

జఫర్‌గఢ్: రేగడితండా శివారు టీబీతండాలో కడియం శ్రీహరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె దివ్య ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచ్ భూక్య పార్వతి రవి, బానోత్ రాజేష్‌నాయక్, ఎంపీటీసీ దేవేందర్ నాయక్, ఉప సర్పంచ్ దేవేందర్, బాలాజీ పాల్గొన్నారు. అలాగే కడియం శ్రీహరిని గెలిపించాలని మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, అన్నెపు అశోక్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లిలో..

రఘునాథపల్లి: కంచనపల్లిలో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు ఆ పార్టీ నాయకులు ఇంటింటా బొట్టుపెడుతూ ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గవ్వాని విజయనాగేశ్వర్, ఎంపీటీసీ కేమిడి రమ్యరాజుల ఆద్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.